దిండి రిసార్ట్స్‌లో అవకతవకలు

రూ. కోటి మేర గోల్‌మాల్.. మేనేజర్, నలుగురు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు - 5లో



'స్పందన'కు వినతుల వెల్లువ

- కలెక్టరేట్‌లో మొత్తం 226 అర్జీల స్వీకరణ
- ఒకే అంశంపై పదేపదే అర్జీలు రాకుండా చర్యలు : కలెక్టర్

అమలాపురం టౌన్, మార్చి4: ఒకే అంశంపై పదేపదే అర్జీలు నమోదు కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'స్పందన' నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అర్జీదారుల నుంచి 226 అర్జీలు స్వీకరించారు. సాగునీరు అందక రైతులు పడుతున్న అవస్థలతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థల పట్టాల కోసం అర్జీలు అందించారు. సీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా పరిశ్రమలకేంద్రం సహాయ సంచాలకుడు శివరామప్రసాద్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సాగునీరు అందట్లేదు: పాశర్లపూడి గ్రామ రైతులు

ప్రస్తుత దాళ్వా పంటకు సాగు నీరు అందట్లేదు. పంట చిరుపొట్ట దశలో ఉంది. నీటి కొరతతో చేలు ఎండిపోయి నెర్రలు తీస్తున్నాయి. వెంటనే నీటిని విడుదల చేసే విధంగా చర్యలు తీసుకుని పంటను కాపాడాలి. కొట్టుమెరకలోని పంట కాల్వ పూర్తిగా చెత్తాచెదారంతో నిండి పోయింది. వాటిని తొలగించి సాగునీటి ప్రవాహానికి అవరోధం లేకుండా చూడాలని కోరుతూ రైతులు మట్టపర్తి వెంకట్రావు, చప్పిడి నాగేశ్వరరావు, ఉల్లంపర్తి సత్యనారాయణ, బొంతు సింహాద్రిరావు తదితరులు అర్జీ అందించారు.



స్పీడు బ్రేకర్లు వేయాలి : బీజేపీ యువమోర్చా నాయకులు

బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పెద్ద ప్రమాదమే జరిగింది. ఆ సమయంలో విద్యార్థులెవరూ బయటలేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకల వేగాలను నియంత్రించే చర్యలు తీసుకుని ప్రమాదాలను అరికట్టాలని యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశిన ఫణీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు, బొంతు శివాజీ, నందూరి శ్రీరామ్, అరిగెల తేజలు అర్జీ అందించారు.



పెన్షన్ మంజూరైందన్నారు.. ఏదీ?

ఈ ఏడాది జనవరిలో దివ్యాంగ పెన్షన్ మంజూరైందన్నారు. అప్పటి నుంచి పెన్షన్ కోసం తిరుగుతున్నాం. అయినా ఇవ్వలేదు. పెన్షన్ ఎందుకు నిలిచిపోయిందో తెలియదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. తిరిగి దరఖాస్తు చేసుకోమంటున్నారు. పెన్షన్ మంజూరైంది చెప్పి మళ్లీ దరఖాస్తు చేసుకోవాలా. కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి దివ్యాంగ పెన్షన్ అందించి ఆదుకోవాలి. - **అద్దంకి అభిషై, దివ్యాంగుడు, ఈతకోట**



ఇంటి స్థలం అందించండి..


సంచార జీవనం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. భార్యతోపాటు ఆరుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం ఇంతవరకు ఇళ్ల స్థలం కేటాయించలేదు. భార్య, పిల్లలతో పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఇంటి స్థల పట్టా అందించి ఆదుకోవాలి.

- కాలూరి వెంకటేష్‌తో కుటుంబ సభ్యులు, అల్లవరం



కాలపరిమితి ఉత్తర్వును రద్దుచేయాలి : వీవోఏల సంఘం

వీవోఏల మూడేళ్ల కాల పరిమితి ఉత్తర్వును రద్దుచేయాలని ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గ్రామ సమాఖ్యల్లో వీవోఏలను విలీనం చేయాలని చేస్తున్న ప్రయత్నాలను విరమించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలుచేయాలని, గ్రూపు ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. డ్వాక్రా వెలుగు యానిమేటర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి డిమాండు చేశారు. ప్రభుత్వం ప్రకటించినట్టు రూ.10 వేల వేతనం చెల్లించాలన్నారు. కలెక్టర్‌కు అర్జీ అందించిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి, శ్యామల, సుబ్బలక్ష్మి, సుమలత, నాగమణి, రత్నకుమారి ఉన్నారు.



ఉచిత విద్య అన్నారు.. ఏదీ..

గతేడాది కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితమంటే దరఖాస్తు చేసి ఆయా పాఠశాలల్లో చేర్పించాం. ఉచిత విద్య అని చెప్పి పుస్తకాలకు రూ.7,500, దుస్తులకు రూ.1,500 చొప్పున వసూలు చేసినా పట్టించుకోలేదు. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోని పాఠశాల విద్యార్థులు రూ.8 వేలు, గ్రామీణ ప్రాంత విద్యార్థులు రూ.6,500 చొప్పున చెల్లించాలని పాఠశాలల యాజమాన్యాలు డిమాండు చేస్తున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులను కలిసినా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ట్యూషన్ ఫీజులు చెల్లించాలని చెబుతున్నారు. జీవోను రద్దు చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలి.

- జి.వెంకటరమణ, డి.ఎరకేశవరావు, కామనగరువు

ఎన్నికల కోడ్ వచ్చేస్తుందేమోనని..

రిబ్బన్ కటింగ్!

- మంచినీటి ప్రాజెక్టు పూర్తికాకుండానే హడావుడిగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు
- 21 ఏళ్లుగా సాగుతున్న మంచినీటి ప్రాజెక్టు పనులు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు
- తర్వాత పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎట్టకేలకు అందుబాటులో రెండు వాటర్ ట్యాంకులు
- తామే చేశామని చెప్పుకునేందుకు ఇప్పుడు ఆరాటం
- ఇప్పటికీ పూర్తికాని ఇంటింటికి కుళాయి పనులు

అంబాజీపేట, మార్చి 4: జిల్లాలో మేజర్‌పంచాయతీగా ఉన్న మాచవరం పరిధిలోని కామయ్యకోడు వద్ద నిర్మించిన మంచినీటి ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే ప్రారంభోత్సవానికి ఏర్పాటుచేస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఐదు వాటర్ ట్యాంకులు నిర్మించి వాటి ద్వారా గ్రామంలో ఉన్న సుమారు 25 వేల పైబడి ఉన్న ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఈ ఐదు వాటర్ ట్యాంకుల్లో కేవలం రెండు వాటర్ ట్యాంకులను మాత్రమే అందుబాటులోకి తీసుకువచ్చి ఎన్నికల కోడ్ వస్తుందనే నేపథ్యంలో ఈనెల 6వ తేదీన ప్రారంభోత్సవానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండా వైసీపీ ప్రభుత్వం ప్రారంభోత్సం చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండడంతో పలువురు నేతలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పనులు పూర్తిస్థాయిలో చేపట్టిన తరువాతే ఈ మంచినీటి ప్రాజెక్టును ప్రారంభించాలని డిమాండు చేస్తున్నారు.

2003లోనే ప్రారంభమైన ప్రాజెక్టు పనులు

2003లో మాచవరం గ్రామ ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించే విధంగా పంచాయతీ పరిధిలోని కామయ్యకోడులో అప్పటి టీడీపీ ప్రభుత్వం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించింది. అయితే ఈ పనులు ముందుకు సాగలేదు. మళ్లీ 2019లో టీడీపీ హయాంలోనే సుమారు రూ.7 కోట్లు నిధులు కేటాయించి మంచినీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేశారు. కానీ ఈ పథకం పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. 2019 ఎన్నికల ముందు ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లుచేశారు. అయితే ప్రాజెక్టు నిర్మాణంలో సాండ్ ఫిల్టర్ నాసిరకం ఏర్పాటుచేశారని అప్పట్లో స్థానికులు ఆందోళన చేయడంతో ప్రభుత్వం రెండు వాటర్ ట్యాంకులు, రాపిడ్ సాండ్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.2.50 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధుల ద్వారా వాటర్ ట్యాంకులు, ఆర్ఎస్ఎఫ్‌ను ఏర్పాటుచేశారు. అయితే మంచినీటి ప్రాజెక్టు వద్ద చెరువులోని తాగునీరు చాలాకాలం నిల్వ ఉండడంతో నీరు కలుషితమైనట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే అక్కడ గత కొన్నేళ్ల కిందట ఏర్పాటుచేసిన ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్ తుప్పుపట్టిందని చెబుతున్నారు. మంచినీటి చెరువు చుట్టూ రక్షణ గోడ లేకపోవడంతో ఆ చెరువులో పడి గతంలో ఇద్దరు మృతి చెందారు. అయినప్పటికీ ఇవేవీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. అలాగే ఈ ఏడాది జలజీవన్ మిషన్ ద్వారా మాచవరంలో ఇంటింటికి కుళాయిలను ఏర్పాటుచేస్తున్నారు. కానీ ఇప్పటిదాకా ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ వేసవిలోనైనా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించి తాగునీరు అందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు.





మాచవరంలో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టు.. రంగుమారిన చెరువునీరు.. (పక్కన) తుప్పు పట్టిన ఫిల్టర్లు

ఏటా తప్పని తాగునీటి కష్టాలు

మాచవరం గ్రామ ప్రజలతోపాటు మండలంలోని వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాలకు ప్రతి ఏటా వేసవిలో తాగునీటి కష్టాలు తప్పడంలేదు. మాచవరంలో రూ.11 కోట్లతో మంచినీటి ప్రాజెక్టును నిర్మించినా వాటి పనులు పూర్తికాకపోవడంతో ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు వద్ద 20 లీటర్ల టిన్నును రూ.10 కొనుగోలు చేసుకుంటున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇక నదీతీర ప్రాంతాలైన వాకలగరువు, తొండవరం, నందంపూడిలో వేసవిలో గుక్కెడు తాగునీరు అందడంలేదు. ఈ ప్రాంతాలకు అమలాపురం నుంచి వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టారు.

తాగునీటి పరీక్షలు తరువాతే ప్రజలకు అందిస్తాం..

మాచవరం శివారు కామయ్యకోడులో నిర్మించిన మంచినీటి ప్రాజెక్టుపై ప్రజలకు అనేక అపోహలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి కెనాల్ ద్వారా నీరు వస్తుంది. ఈ నీటిని అక్కడ ఉన్న ఆర్ఎస్ఎఫ్ ద్వారా శుద్ధి చేసి ప్రజలకు అందిస్తాం. ఈ తాగునీటి పరీక్షల నిమిత్తం అమలాపురం, రాజమహేంద్రవరం ల్యాబ్‌కు పంపించడం జరుగుతుంది. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగానే ప్రజలకు రక్షిత మంచినీరు అందిస్తాం. అయితే ఈ మంచినీటి ప్రాజెక్టును 6వ తేదీన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు పరిధిలో మాచవరం, ప్రాజెక్టు వద్ద నిర్మించిన రెండు వాటర్ ట్యాంకుల ద్వారా స్టోరేజీ చేసి ఆయా ప్రాంతవాసులకు రక్షిత మంచినీటిని అందిస్తాం. త్వరలో మిగిలిన మూడు ట్యాంకులను వినియోగంలోకి తీసుకొచ్చి వాటి ద్వారా గ్రామంలో ఉన్న ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందిస్తాం.



నీటి సరఫరా విభాగ భవనానికి కొత్తగా రంగులు

- పద్మనాభం, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, పి.గన్నవరం

తపాలా బ్యాలెట్లు దుర్వినియోగం కాకుండా చూడాలి : కలెక్టర్

అమలాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నిబంధనలను తూచా తప్పకుండా ఆచరిస్తూ ఎన్నికల సిబ్బందికి ఇచ్చే తపాలా బ్యాలెట్లు దుర్వినియోగం కాకుండా చూడాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో త్వరలో జరగనున్న పార్లమెంటు అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో తపాలా బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తపాలా బ్యాలెట్లు దుర్వినియోగం కాకుండా సిబ్బంది విధులు నిర్వహించే ప్రాంతాల సమీపంలోని ప్రత్యేక కేంద్రాల్లో సమర్పించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించి సిబ్బందికి తపాలా బ్యాలెట్లు అందజేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ సిఫార్సుల మేరకు ప్రభుత్వం నిబంధనలను మార్చడం జరిగిందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించి సిబ్బందితోపాటు సర్వీసు ఓటర్లుగా ఉన్న ఆర్మీ జవాన్లు, దివ్యాంగులు, 85ఏళ్ల పైబడిన వృద్ధులకు తపాలా బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు. తపాలా బ్యాలెట్ ఓటింగ్ విధానంపై కలెక్టర్‌తోపాటు సీపీవో వెంకటేశ్వర్లు ఎన్నికల సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా తపాలా బ్యాలెట్ ఓటుపై రహస్య పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. జేసీ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, కోఆర్డినేషన్ అధికారి టి.వైద్యనాథశర్మ పాల్గొన్నారు.

అమలాపురంలో కేంద్ర బలగాల కవాతు

అమలాపురం టౌన్, మార్చి 4: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన అమలాపురానికి కేంద్ర బలగాలు చేరుకున్నాయి. శాంతి భద్రతలను పరిరక్షించడంతోపాటు ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చూసేందుకు కేంద్ర బలగాలు దోహదపడతాయని కలెక్టర్ హిమాన్షుశుక్లా, జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌లు పేర్కొన్నారు. సోమవారం అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద నుంచి కేంద్ర సాయుధ బలగాల ఫ్లాగ్‌మార్చ్, పోలీసు కవాతును వారు ప్రారంభించారు. హైస్కూలు సెంటర్, గడియార స్తంభం సెంటర్, సినిమారోడ్డు మీదుగా కవాతు చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ఏఆర్‌డీఎస్పీ పార్థసారధి, తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్‌బీ సీఐలు శ్రీనివాస్, రాజశేఖర్‌తోపాటు పోలీసులు పాల్గొన్నారు.





అమలాపురంలో కేంద్ర బలగాల కవాతులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ.. (కింద) తపాలా బ్యాలెట్ల వినియోగంపై కలెక్టర్ శిక్షణ



మాకనపాలెంలో సాగునీరు అందడం లేదని నిరసన తెలియజేస్తున్న రైతులు

సాగునీటి కోసం ఆందోళన

మామిడికుదురు, మార్చి4: అవసరమైన సాగునీరు అందక రైతులు తమ పంట పొలాలు బీటలు వారుతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తూ మాకనపాలెం గ్రామానికి చెందిన రైతులు నిరసన తెలియజేశారు. బీటలు వారిన పొలాల్లో నిలబడి ఎండిన వరి దుబ్బులు తీసి చూపిస్తూ తమ నిరసన తెలిపారు. సుమారు 60 ఎకరాల దాళ్వా వరిచేలు నెర్రలు తీశాయన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వంతులవారీ విధానంలో అవసరమైన నీరందక తమ పంట పొలాలు పాడై పోయే స్థితికి వచ్చాయని ఆందోళన వ్యక్తంచేశారు. చిరుపొట్ట మీద ఉన్న దశలో తాగునీటి అవసరం చాలా ఉంటుందని, దానికోసమైనా నీరందేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వరిచేలు బీటలు వారుతున్నాయి

- కొత్తపేటలో అవిడి ఆయకట్టు రైతుల ధర్నా
- ఆర్డీవోకు రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు ఆకుల, రైతుల వినతిపత్రం

కొత్తపేట, మార్చి4: కొత్తపేట మండలం అవిడి గ్రామం ఆయకట్టు రైతులు సాగునీరులేక చేలు బీటలు వారి ఎండిపోతున్నాయంటూ గగ్గోలుపెడుతున్నారు. దీంతో రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు ఆకుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో స్పందన కార్యక్రమానికి వచ్చిన ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ ముందు నినాదాలు ఇస్తూ ధర్నా చేశారు. అనంతరం రామకృష్ణ రైతుల పక్షాన ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. అవిడి ఆయకట్టు పరిధిలోని 3 వేల ఎకరాల్లో వరి పండిస్తున్నారని, ప్రభుత్వం నీటిపారుదల శాఖాధికారులతో వంతులవారీ విధానంలో నీటిని పంపిణీ చేస్తున్నారని, ఈ విధానం వల్ల వరి పొట్టదశలో ఉండడంతో సరిపోవడంలేదని రామకృష్ణ వాపోయారు. నీరందక చేలు బీటలు వారుతున్నాయని, వంతుల వారీ విధానాన్ని రద్దుచేసి వరికి సరిపడా నీటిని విడుదల చేయాలని ఆర్డీవోను కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు ఎండిపోయి రైతులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతునేతలు త్సామా బాబు, చోడపనీడి భాస్కరరావు, చిల్లే ప్రసాదరావు, నక్కా వెంకటేశ్వరరావు, రెడ్డి తాతాజీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




కొత్తపేట ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర తెలుగు రైతు అధ్యక్షుడు రామకృష్ణ

టీడీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లావాసులకు చోటు



దేశంశెట్టి



హుస్సేన్

అమలాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు వాణిజ్య విభాగం రాష్ట్ర అదనపు కమిటీని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. టీడీపీ వాణిజ్య విభాగంలో జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ(అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం), అధికార ప్రతినిధిగా దర్నాల రామకృష్ణ(కొత్తపేట), కార్యదర్శులుగా యాళ్ల సూర్యప్రకాశరావు (ముమ్మిడివరం), బిక్కిన వీరేశ్వరజయకుమార్ (పి.గన్నవరం)లతో పాటు ముస్లిం మైనార్టీ రాష్ట్ర కమిటీలో అధికార ప్రతినిధిగా హాజిముఖరం హుస్సేన్(పి.గన్నవరం)లను నియమించారు.

వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా దేశంశెట్టి

ఉప్పలగుప్తం, మార్చి 4: తెలుగుదేశం వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా భీమనపల్లికి చెందిన మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ నియమితులయ్యారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నుంచి నియామక ఉత్తర్వులందినట్టు దేశంశెట్టి తెలిపారు. ఆయన ఇప్పటికే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయనను మాజీ ఎమ్మెల్యే ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, యువతని యోజకవర్గ, మండల అధ్యక్షులు గొలకోటి చిన్నా, ఆకేటి పెద్ద అభినందించారు.

టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ముకరం

మామిడికుదురు, మార్చి 4: తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నగరం గ్రామానికి చెందిన హాజి ముకరం హుస్సేన్‌ను నియమించారు. రాష్ట్ర కమిటీ నియామకంలో భాగంగా ముకరంకు అధికార ప్రతినిధి పదవి దక్కింది. తనకు పదవి కల్పించిన చంద్రబాబునాయుడు, ఇతర ముఖ్య నాయకులకు ముకరం కృతజ్ఞతలు తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్య

- రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరూ మైనర్లే
- అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస సమీపంలో చెట్టుకు ఉరేసుకుని చనిపోయిన వైనం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు

అరకులోయ, మార్చి 4: అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలో కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఆదివారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలోని హుకుంపేట ప్రాంతానికి చెందిన ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి అరకులోయ ఎస్ఐ సంతోష్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. హుకుంపేటలో నివాసం ఉంటున్న చప్పా చైతన్య (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలిక జ్యోత్స్న (14) హైస్కూల్‌లో చదువుతున్నది. వీరిద్దరూ గత నెల 27వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చారు. తర్వాత ఇంటికి చేరకపోవడంతో తల్లిదండ్రులు ఆ ప్రాంతంలోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అనంతగిరి మండలం కరకవలస గ్రామ సమీపంలోని కటికి జలపాతానికి వెళ్లే దారిలో ఇద్దరూ ఉరి వేసుకుని మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా వారిద్దరూ రాజమండ్రి ప్రాంతానికి చెందిన చైతన్య, జ్యోత్స్నగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సోమవారం సాయంత్రం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

చైతన్య, జ్యోత్స్న మృతి విషయం తెలియగానే ఇక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చైతన్య ప్రేమలో ఉన్నట్టు తెలియదని తండ్రి చప్పా శ్రీను లబోదిబోమని విలపించాడు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, చైతన్య ఇంటర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ కావడంతో పరీక్ష రాసేందుకు సిద్ధ మవుతున్నాడని, రెండు రోజుల్లో పరీక్ష రాయాల్సి ఉందని, ఈసారి తప్పకుండా పాసవుతానని చెప్పాడని, ఈ క్రమంలో ఇంత అఘాయిత్యానికి పాల్పడతాడని ఊహించలేదని ఆయన వాపోయాడు. జ్యోత్స్న బంధువులు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఊరంతా వెతి కామని, ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంతలో విషాద వార్త వినడాన్ని తట్టుకోలేకపోతున్నామని వాపోయారు. వారి ప్రేమబంధాన్ని తమకు చెప్పినా బాగుండేదని రోదించారు.

ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

తుని రూరల్, మార్చి 4: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైళ్లల్లో చార్జింగ్ పెట్టి నిద్రపోతున్న ప్రయాణికులే లక్ష్యంగా సెల్‌ఫోన్‌లు చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 8 కంపెనీలకు చెందిన 6 సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకుని కాకినాడకు చెందిన వల్లి రాజేష్, పిఠాపురానికి చెందిన బోడకుర్తి రాజేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విజయవాడ రైల్వే కోర్టులో హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాస్, కానిస్టేబుల్ ఎస్. రామకోటిను అభినందించారు.


సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

దిండి రిసార్ట్స్‌లో అవకతవకలు

మేనేజర్, నలుగురు ఉద్యోగులపై పోలీసులకు ఫిర్యాదు

మలికిపురం, మార్చి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం దిండి ఏపీ టూరిజం రిసార్ట్స్‌లో భారీగా అవకతవకలు జరిగినట్టు రాజోలు సీఐ గోవిందరాజు సోమవారం తెలిపారు. రిసార్ట్స్‌లో సుమారు కోటి రూపాయల మేర అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. మేనేజరు ఫణీంద్రతో పాటు మరో నలుగురు ఉద్యోగులు 2021 నుంచి ఈ అవకతవకలకు పాల్పడ్డారన్నారు. గత 25 రోజులుగా దిండి రిసార్ట్స్‌లో టూరిజం, విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలించి మలికిపురం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.1,16,36,260 అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదు అందిందన్నారు. రాజోలు సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో మలికిపురం ఎస్ఐ సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

ముమ్మిడివరం, మార్చి 4: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి మల్లాయిపాలెం పరిధిలోని కొత్త కాలనీలో సానబోయిన దేవిశ్రీ భర్తమోహన్, అత్తమామలతో కలిసి నివాసం ఉంటోంది. వారికి పన్నెండేళ్ల కుమారుడు తనూజనాగసూర్య, ఎనిమిదేళ్ల కుమార్తె వర్షిణి ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ముమ్మిడివరం ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

రాజమహేంద్రవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నేరస్తుడికి తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..శాటిలైట్ సిటీలోని డీ బ్లాక్‌కు చెందిన బోయిన మునలయ్య, నీలాల మంగారావు రాడ్ బెండింగ్ పనికి వెళ్లేవారు. వాళ్లతో మునలయ్య అన్న దుర్గారావు కూడా వెళ్లేవాడు. అయితే దుర్గారావుతో మంగారావు మందు తాగించి పాడు చేస్తున్నాడని దుర్గారావు తండ్రి మంగారావును మందలించాడు. ఈ క్రమంలో 2019 ఫిబ్రవరి 25న గొడవ జరిగింది. దీంతో మంగారావుపై మునలయ్య కక్ష పెంచుకున్నాడు. మరుసటి రోజు ఉదయం పనికి వెళదామంటూ మంగారావును మునలయ్య కల్లు దుకాణానికి తీసుకెళ్లి బాగా తాగించాడు. ఇంటికి తీసుకెళతానని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని కవలగొయ్యి వెళ్లే దారిలో ఓ తోట వద్ద మంగారావును కిందపడేసి ముఖంపై బండరాయితో కొట్టి చంపేశాడు. దీనిపై అప్పటి బొమ్మూరు సీఐ కె.దామోదర్‌రావు కేసు నమోదు చేశారు. బోయిన మునలయ్యపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఏ.బాషా, కోర్టు విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు. ట్రైల్ కేసుల ప్రత్యేక పర్యవేక్షణ ఫలితాలనిస్తోందని ఆయన చెప్పారు.

మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్(కాకినాడ), మార్చి 4: ఉమ్మడి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో ప్రకటించిన ఫార్మాసిస్ట్, లాస్ట్ గ్రేట్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ పోస్టుల నియామకం కోసం అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ జాబితాలను ఆన్‌లైన్ ఎన్ఐసీలో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు లిస్ట్‌ను పరిశీలించుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కాకినాడలో జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ కింది వెబ్‌సైట్‌లో జాబితాలను పరిశీలించుకోవాలన్నారు.

http://eastgodavari.ap.gov.in
http://kakinada.ap.gov.in
http://konaseema.ap.gov.in

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కరప, మార్చి 4: కరప మండలం కొంగోడు గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతిచెందాడు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడిశెట్టి రమణయ్య(42) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా సోమవారం ఉదయం రమణయ్య కొంగోడు గ్రామం ఎంట్రన్స్‌లో ఆర్చ్ పక్కన చింతా బూరయ్యకు చెందిన పాన్‌షాపుకు షెడ్డు వేసే పని చేస్తున్నాడు. షెడ్డుకు కర్రలు కడుతుండగా ప్రమాదవశాత్తు ఫ్రిడ్జ్ విద్యుత్ వైర్లు ఇనుప రాడ్‌కు తగిలి రమణయ్య షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న రమణయ్యను గొల్లపాలెం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. అతని భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ప్రజాదరణ పొందిన నేత వరుపుల రాజా

రాజా విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మంత్రులు రాజప్ప, సుజయకృష్ణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రత్తిపాడు, మార్చి 4: ప్రజల మన్ననలతో రాజకీయాల్లో రాణించిన గొప్ప నేత వరుపుల రాజా అని మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, సుజయకృష్ణ రంగారావు కొనియాడారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరుపుల రాజా విగ్రహాన్ని సత్యప్రభతో కలిసి మాజీ మంత్రులు ఆవిష్కరించారు. రాజా ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధి కోసం రాజా జిల్లాలో కష్టపడి పని చేశారని ఆయన లేని లోటు తీర్చలేనిదని నియోజకవర్గంలో అన్ని వర్గాల వారిని కలుపుకుని వెళుతున్న సత్యప్రభకు రాబోయే ఎన్నికల్లో ఘన విజయం చేకూర్చాలన్నారు. మాజీ మంత్రి, టీడీపీ జోనల్ 2 కోఆర్డినేటర్ సుజన కృష్ణ రంగారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వరుపుల రాజా ఆత్మ శాంతి చేకూరే విధంగా ఎన్నికల ఫలితం ఉండాలని ఆ విధంగా రాజా అభిమానులు, కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు. సత్యప్రభ భవిష్యత్ కోసం తమ పార్టీ అధినేత చంద్రబాబు ఎంతో ఆలోచిస్తున్నారని, ఆమెకు ఏ ఇబ్బంది కలగకుండా ఆమెను ముందుండి నడిపించే విధంగా తోడ్పాటు నందించాలని చంద్రబాబు తమను పదేపదే ఆదేశిస్తున్నారని చెప్పారు. అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు యనమల కృష్ణుడు, వత్సవాయి సూర్యనారాయణరాజు (మీసాల రాజు), ఎస్‌వీఎస్ అప్పలరాజులు, సానా ఫౌండేషన్ నాయకుడు సానా సతీష్ బాబు, టీడీపీ నాయకులు పర్వత సురేష్, ముదునూరి మురళీకృష్ణంరాజు, ఇతంశెట్టి భాస్కరబాబు, బద్ది రామారావు, తోట నవీన్, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన నాయకులు వరుపుల తమ్మయ్యబాబు, తుమ్మల రామస్వామి, పెంటకోట మోహన్, దాసం శేషారావు పాల్గొన్నారు. రాజా వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆయన అభిమానులు 100 మంది రక్తదానం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు ప్రారంభించారు.

మావోయిస్టుల లేఖ విడుదల

చింతూరు, మార్చి 4 : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8న ఘనంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం- అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ మావోయిస్టు పార్టీ ప్రతినిధి అజాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన పేరిట ఓ లేఖ విడుదలైంది. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల రాజ్య హింసలకు, హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడదామని, స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించుకుందామని, బ్రాహ్మణీయ హిందుత్వ మతోన్మాద సంకెళ్లను తెంచుకుందామని, స్త్రీ విముక్తి పోరు బాటలో నడుద్దామని, శ్రామిక విముక్తి లేనిదే స్త్రీ విముక్తి లేదని లేఖలో అజాద్ పేర్కొన్నారు. పల్లెల్లో రైతు మహిళల శ్రమ శక్తి దోపిడికి గురవుతోందని, పట్టణాలలో పెట్టుబడిదారులు తక్కువ వేతనాలు ఇచ్చి మహిళలతో వెట్టి చాకిరీ చేయి ంచుకుంటున్నారని ఆజాద్ ఆరోపించారు. మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఎందరో వీరవనితలు పోరాటం చేసి ప్రాణాలు అర్పించారన్నారు. పోలీసులు పాల్పడుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎందరో వీర వనితలు సమర శీల పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. చివరకు వ్యాపార ప్రకటనలలో సైతం మహిళలను అశ్లీలంగా చూపిస్తూ అంగడి సరుకుగా మార్చారని అజాద్ ఆరోపించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

గోకవరం, మార్చి 4: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి 16.467 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గోకవరం పోలీసులు సోమవారం జరిపిన దాడుల్లో మండలంలోని కొత్తపల్లి పెదచెరువు నుంచి రామన్నపాలెం వెళ్లే రోడ్డులో గంజాయిని తరలించడానికి సిద్ధంగా ఉన్న ఒడిసా రాష్ట్రానికి చెందిన గణపతి జిల్లాలోని చెంబాలపూర్ గ్రామానికి చెందిన అక్షయరైటా, జిబిత్‌రైటాలను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.82,335 ఉంటుందని పోలీసులు తెలిపారు.

పునరావాస సమస్యలను పరిష్కరించాలని వినతి

ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం


వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

దేవీపట్నం,మార్చి 4: పునరావాస సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం దేవీపట్నం, తొయ్యేరు గ్రామాల పోలవరం నిర్వాసితులు విజయవాడలో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడారు. 'మండలంలో 44 గిరిజన, గిరిజనేతర గ్రామాలు పోలవరం ప్రాజెక్టు మూలంగా పూర్తిగా నీటమునిగాయి. ఇంకా అనేక మందికి భూ పరిహారాలు, పునరావాసం కూడా ఇంకా కల్పించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. వందలాది మంది ఇళ్ల నిర్మాణం పూర్తికాక నిలువ నీడలేకుండా అవస్థలు పడుతున్నారు. ప్యాకేజీకి అర్హులైన 1200 మందికి జాబితాలో చోటు దక్కలేదన్నారు. 630 ఇళ్లు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు' అని అన్నారు. మొదటి, రెండు, మూడు జాబితాల్లో సుమారు 600 మందికి పునరావాసం పరిహారం జమ కాలేదన్నారు. రెండు, మూడు జాబితాల్లో ఉన్న వారితో పాటు ఇంకా 520 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పునరావాస కాలనీతో పాటు దేవీపట్నం, పూడిపల్లి గ్రామాలకు ఇంకా శ్మశాన వాటికలకు స్థలం కేటాయించలేదన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాలను వదిలి వచ్చినప్పటి నుంచి తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలిశెట్టి శివరామకృష్ణ, సిద్ధా సత్యనారాయణ, సిద్ధా వీరబాబు, దొడ్డా సింహాద్రి, కుడిదేల గంగరాజు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చాగల్లు మండలంలోని కలవలపల్లిలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పక్కన ఖాళీ ప్రదేశంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేశారు. 46 బస్తాల్లో నిల్వ ఉంచిన 2050 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే గ్రామానికి చెందిన మెట్టపల్లి నరసింహరాజు రామచంద్రాపురం, ఉనకరమిల్లి గ్రామాల్లో రేషన్ బియ్యం కిలో రూ.16 చొప్పున సేకరించి ఇటుక బట్టీలు తదితర చోట్ల పనిచేస్తున్న కూలీలకు రూ.18కి విక్రయిస్తున్నాడని గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.92,375 ఉంటుందని, నరసింహరాజుపై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేశామని ఎస్పీ సుబ్బారెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ అమ్మకం, నిల్వలపై నిఘా పెట్టామని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోదాల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తా

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభిస్తున్న చంటిబాబు

గోకవరం, మార్చి 4: నాలుగు రోజుల్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు చెప్పారు. గోకవరం మండలం కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహానికి సీటు కేటాయిస్తే ఆయన గెలుపునకు సహకరించాలని ఉందని కానీ తన వర్గాన్ని ఆయన చిన్నచూపు చూడడం వల్ల మరోమారు పునరాలోచనలో పడాల్సి వస్తుందన్నారు. ఇంట్లో వాళ్లతో కూడా ఓట్లు వేయించలేని నాయకులు నరసింహం చుట్టూ చేరి ఆయనను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాలను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమన్నారు. తన విషయంలో అధికారులను కూడా ప్రోటోకాల్ పాటించకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అటు నాయకుల్లోనూ, ఇటు అధికారుల్లోనూ పార్టీ పరువు దిగజారిపోతోందని ఆయన ఆందోళన చెందారు. నరసింహం తన కేడర్ మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే హోదాలో తాను కల్పించిన పదవులను సైతం తన వర్గం నుంచి చెప్పాపెట్టకుండా లాక్కొని వేరేవారికి అప్పగించారన్నారు. ఆయన తీరుపట్ల తన కేడర్ అసంతృప్తితో ఉందన్నారు.

మద్యం తాగవద్దని భార్య వారించినందుకు నిప్పంటించుకున్న భర్త

సర్పవరం జంక్షన్, మార్చి 4: అనారోగ్యంతో ఉంటూ మద్యం తాగుతున్న భర్తను మద్యం తాగవద్దని భార్య వారించడంతో కోపంతో టర్పంటాయిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎస్.అచ్యుతాపురంలో ఆదివారం రాత్రి జరిగింది. కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్యుతాపురానికి చెందిన పైడా సుబ్బారావు (64)కు 2017లో ఆపరేషన్ జరిగింది. డాక్టర్లు మద్యం తాగవద్దని సూచించారు. అయితే గత ఆరు నెలల నుంచి కుటుంబ సభ్యులు మందలిస్తున్నా మద్యం తాగడం ప్రారంభించాడు. ఆదివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం ఎందుకు తాగావు, తాగవద్దని డాక్టర్లు చెప్పారు కదా అని భార్య నిలదీసింది.. దాంతో ఇంట్లో ఉన్న టర్పంటాయిల్‌ని శరీరంపై పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు సమీపంలో నాగమల్లితోట జంక్షన్‌లో గల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. కుమారుడు భార్గవి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా త్రయంబకేశ్వరస్వామి కల్యాణం


స్వామి వారికి అభిషేకం చేస్తున్న నవీన్ కుటుంబ సభ్యులు

జగ్గంపేట, మార్చి 4: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో భాగంగా సోమవారం 8వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, మహావ్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, రుద్రహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూరామణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని త్రయంబకేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శ్రీ నవశక్తి క్షేత్ర విశ్వ ధర్మ పరిరక్షణ వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరమ పూజ్యశ్రీశ్రీశ్రీ భవాని శంకరానంద స్వామి మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. వేలాదిగా భక్తులు పాల్గొని తమ స్వహస్తాలతో కోటి పార్థివలింగాలకు అభిషేకం నిర్వహించారు. గోకవరం గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ధార్మిక సేవకులు కంబాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని శంకరానంద స్వామి మాట్లాడుతూ సృష్టికి మూలం ఓంకార శబ్దమని ముక్కోటి దేవతలను మనం దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేసిన జ్యోతుల నెహ్రూ కైలాసమే ఇక్కడ నిర్మించారన్నట్లుగా దేవాలయాలు నిర్మించారన్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రతిష్ఠించారని చెప్పారు. మహారుద్రాభిషేకం కార్యక్రమం చేయడం అనితర సాధ్యమన్నారు. సాయంత్రం ప్రవచనాల సందర్భంగా శివతత్వంపై వివరించారు.

జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలి

రంపచోడవరం, మార్చి 4: ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల బాలురెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. అటవీ ఫలసాయం, జీడిపిక్కలు, జాఫ్రా గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. తొలుత ఈ నెల పదో తేదీన ఏజెన్సీ మన్యం బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలని కోరుతూ తీర్మానించారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయసునీత

రంపచోడవరం, మార్చి 4: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆమె ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సుమారు 48 అర్జీలు అందాయన్నారు. పులిగోగులపాడులో జీడిపిక్కల ప్రాసెసింగ్ ఏర్పాటు చేయాలని, 18 ఏళ్లు నిండిన వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని, భూపతిపాలెం జలాశయంలో పర్యాటక శాఖ ద్వారా విహార బోట్లకు అనుమతి మంజూరు చేయాలని, సొసైటీ సభ్యులకు చేపలు పట్టుకొనేలా ఉత్తర్వులు మంజూరు చేయాలని, గుర్తేడు, ధారకొండ, ఎడ్లకొండ గ్రామాల్లో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్డీసీలు జాన్‌రాజ్, డీఎస్ శాస్త్రీ, డీడీ షరీఫ్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఈవో మల్లేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన

రంపచోడవరం, మార్చి 4: విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆమె ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు తాగునీరు, పరీక్షా కేంద్రాలలో లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్, తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి పాల్గొన్నారు.



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

కల్పవృక్ష వాహనంపై వేంకటేశ్వర స్వామి

చింతలూరులో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఆలమూరు, మార్చి 4: చింతలూరు వేంకటేశ్వరస్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజైన సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు శ్రద్ధోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని కల్పవృక్ష, ముత్యాల పందిరి వాహనంపై మేళాతాళాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య పుర వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు వాహన సేవలో పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం

కోనసీమ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణకుమారి



మామిడికుదురు, మార్చి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడికుదురుకు చెందిన జగతా వీరకృష్ణకుమారిని నియమించారు. ఈ మేరకు ఆమె అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. కృష్ణకుమారి అమలాపురంలోని శ్రీరామనగర్ వార్డు సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 4: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పేపరు-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. డాక్టర్ మోకా గణపతిరావు డిగ్రీ కళాశాలలో 365 మందికి 341 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో 308 మందికి 286 మంది, తారా కళాశాలలో 235 మందికి 216 మంది పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 908 మందికి 843మంది పరీక్షకు హాజరైనట్టు కస్టోడియన్ డి.విజయ్‌కుమార్ తెలిపారు.

ఇళ్ల స్థల హక్కు పత్రాలు పంపిణీ

కె.గంగవరం, మార్చి 4: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో ఇళ్ల స్థలాల పొందిన వారికి హక్కు పత్రాలను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ పంపన నాగమణిసుబ్బారావు, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, నీతిపూడి మధుబాలవెంకట్రావు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బత్తుల అప్పారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి అధ్యక్షతన జరిగిన సభలో లబ్ధిదారులకు నివేశనా స్థలాల హక్కు పత్రాలను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ అందజేశారు. ఎంపీపీ అంబటి భవానీ, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్యామ్, తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



లైన్‌మెన్లకు సత్కారం

రామచంద్రపురం, మార్చి 4: రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం ప్రజా సేవకే అంకితమైన మిత్రులు లైన్‌మెన్‌లని ఏఈ మేడిశెట్టి వెంకటరమణ అన్నారు. ప్రసన్న విఘ్నేశ్వరా ఫంక్షన్ హాలులో జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.విజయానంద్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. లైన్‌మెన్లను పూలమాలలతో సత్కరించారు. పనిలో ఒత్తిడిని తట్టుకుంటూ ప్రమాదాల బారిన పడకుండా ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలని విజయానంద్ సూచించారు. డిప్యూటీ ఈఈ కె.మురళీమోహన్, డీఈఈ శ్రీధర్, ఏఈ వెంకటరమణ, రామచంద్రపురం డివిజన్ పరిధిలోని 135 మంది లైన్‌మెన్లు పాల్గొన్నారు.

15న విజయవాడలో బహుజన భేరి

అమలాపురం టౌన్, మార్చి 4: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బహుజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 15న విజయవాడలో బహుజన భేరి నిర్వహిస్తున్నట్టు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీఎస్పీ అమలాపురం పార్లమెంటు కార్యాలయంలో సోమవారం పెండెం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బహుజన భేరి కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా ఇన్‌చార్జిలు కాండ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీభవానీ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కోలా త్రిమూర్తులు, కోశాధికారి సాకా రాజారావు, యాళ్ల దొరబాబు, బుడితి దయామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గౌరవ డాక్టరేట్

అమలాపురం టౌన్, మార్చి 4: గుర్రం జాషువా స్మారక కళా పరిషత్, హైదరాబాద్ క్రిస్టియన్ యూనివర్శిటీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీవేత్తలు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో వారికి గౌరవ డాక్టరేట్‌ను డాక్టర్ జె.విద్యాసాగర్, ప్రభుదాస్ అందజేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: సుందరం మాస్టర్
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: భూతద్దం భాస్కర నారాయణ
శేఖర్ స్ర్కీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్ర్కీన్-2	: హనుమాన్
రమా	: గుంటూరు కారం
గణపతి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: ఆపరేషన్ వాలంటైన్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: డోన్

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.68 లక్షలు

ఆత్రేయపురం, మార్చి 4: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,68,448 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.





మామిడికుదురు మండలం గోగన్నమఠం, రాజోలు మండలం వేగివారిపాలెంల్లో జరిగిన సమావేశాల్లో మాట్లాడుతున్న హరీష్‌మాధుర్

రాజోలు కార్యకర్తలు నిజాయితీకి చిరునామా

టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి హరీష్‌మాధుర్

మామిడికుదురు, మార్చి 4: రాజోలు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ధైర్యంగా ఉండాలని ఆ పార్టీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ కోరారు. గోగన్నమఠంలో సాగి పాపయ్యరాజు ఇంటి వద్ద టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరీష్‌మాధుర్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గ కార్యకర్తలు నిజాయితీకి చిరునామాగా నిలుస్తారన్నారు. కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. మంగళవారం మంగళగిరిలో జరిగే జయహో బీసీ సదస్సుకు అధిక సంఖ్యలో బీసీ నాయకులు వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కేతా శ్రీనివాస్, గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, సాగి సత్యనారాయణరాజు, చాగంటి స్వామి, వర్ధినేని బాబ్జీ, రుద్రరాజు వెంకట్రామరాజు, లంకే శ్రీనివాస్, కడలి కృష్ణమోహన్, ఉండ్రు శ్రీరామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: రాజోలు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు నిబద్ధతతో పనిచేసి జనసేన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ పిలుపునిచ్చారు. వేగివారిపాలెంలోని యాండ్ర దొరబాబు షాపు వద్ద రాజోలు మండల విస్తృత స్థాయి సమావేశం మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన హరీష్ మాట్లాడుతూ మనం నమ్మిన నాయకుడు మనల్ని మోసం చేసి వెళ్లిపోయినా మేమంతా చంద్రబాబుకు, టీడీపీకి కట్టుబడి ఉన్నామని నిరూపించిన గొప్ప కార్యకర్తలు రాజోలు నియోజకవర్గ కార్యకర్తలని కొనియాడారు. తన తండ్రి బాలయోగి మాదిరిగానే తాను కూడా మీ అందరితో కలిసి నడుస్తానని, ఆయన చిరకాల కోరిక అయిన రైల్వేలైన్ తెచ్చి తీరుతానని చెప్పారు. మరో ముఖ్య అతిథి, రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసికట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. అనంతరం సూపర్-6 శంఖారావం క్యాలెండర్‌ను హరీష్‌మాధుర్ విడుదల చేశారు. కార్యక్రమంలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల టీడీపీ అధ్యక్షులు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, ముదునూరి చినబాబురాజు, వర్ధినీడి బాబ్జీ, రాపాక నవరత్నం, బందెల పద్మ, మోకా పార్వతి, కాండ్రేగుల భవానీ, మట్టపర్తి లక్ష్మి, రుద్రరాజు వెంకట్రామరాజు, బోళ్ల వెంకటరమణ, చెల్లుబోయిన శ్రీనివాస్, గాలిదేవర వెంకన్నబాబు, అడబాల సాయిబాబు, పామర్తి రమణ, మామిడిశెట్టి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 52 ఆరోగ్య కేంద్రాల భవనాలు పూర్తి

డీఎంహెచ్‌వో దుర్గారావుదొర



అంబాజీపేట మండలం మాచవరంలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

అంబాజీపేట, మార్చి 4: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం జిల్లాలో 432 ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణం చేపట్టగా ఇప్పటివరకు 52 భవనాలు పూర్తయ్యాయని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావుదొర తెలిపారు. అంబాజీపేట మండలంలో పల్స్‌పోలియో సిబ్బంది చేస్తున్న ఇంటింటా సర్వేను సోమవారం ఆయన మాచవరంలో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో పల్స్‌పోలియో విజయవంతంగా జరిగిందన్నారు. 56 పీహెచ్‌సీల పరిధిలో 983 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులు 1,45,839 మంది ఉండగా ఆదివారం 1,41,927 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది 1,850 మంది ఆయా గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వేస్తారన్నారు. 52 మొబైల్ టీమ్స్ 27 పోలియో కేంద్రాలు రెండు రోజుల పాటు ఉంటాయన్నారు. అద్దె భవనాల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలను భవనాలు పూర్తి చేసిన అనంతరం మార్పు చేస్తామన్నారు. జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో రెండు చోట్ల మినహా మిగిలిన పీహెచ్‌సీల్లో వైద్యులు పూర్తి స్థాయిలో వున్నారని చెప్పారు. డీఎంహెచ్‌వో వెంట పీహెచ్‌ఎన్ రత్నకుమారి, సీసీ ఆర్.రామకృష్ణ, హెచ్‌వీ శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ అనూష, ఆశా వర్కర్లు వున్నారు.

'పోలియో రహిత సమాజమే లక్ష్యం'

పి.గన్నవరం, మార్చి 4: పోలియో రహిత సమాజమే మన లక్ష్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర అన్నారు. మండలంలోని లంకలగన్నవరం శివారు జొన్నల్లంకలో పోలియో చుక్కల కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి 0-5 వయసు చిన్నారులు పోలియో చుక్కలు వేయించున్నారా అని ఆరా తీశారు. పి.గన్నవరం బస్టాప్ వద్ద పోలియో చుక్కల కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఎంపీహెచ్‌ఈవో రాయుడు రామకృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్త ఇ.అమ్మాజీ, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

'విద్యార్థులు పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలి'

ద్రాక్షారామ, మార్చి 4: విద్యార్థులు పరిశోధనలపై మక్కువ పెంచుకోవాలని ఇస్రోవిశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ కోరారు. సోమవారం రామచంద్రపురం మండలం హసన్‌బాద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. హెచ్‌ఎం పీఎస్‌బీఎస్‌కే సుందరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంతరిక్షంలో ఉపగ్రహాల ప్రయోగం, కక్ష్య విధానం, పరిశోధనలు, రాకెట్ల తయారీ, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పాత్రలను శివప్రసాద్ వివరించారు. సమగ్ర శిక్షా ఏఎంవో పిల్లి రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.గంగవరం: దంగేరు ఉన్నత పాఠశాలలో ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్‌తో ముఖాముఖి నిర్వహించారు. ఇస్రో పుట్టు పూర్వోత్తరాలు, రాకెట్ ప్రయోగ కేంద్రం, రాకెట్ ప్రయోగాలకు, భౌతిక శాస్త్రానికి ఉన్న అవినాభావ సంబంధాలను ఆయన విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్-3, గగనయాన్ ప్రయోగాలను విశదీకరించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాది దొంతంశెట్టి శ్రీనివాసరావు, అడపా శ్రీనివాసరావు, బాలాజీ పద్మావతి, దంగేటి వీరబ్రహ్మం, రెడ్డి గంగరాజు, బీవీఆర్ఎస్ లక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల సమగ్రాభివృద్ధి కోసమే 'జయహో బీసీ' సదస్సు

మామిడికుదురు, మార్చి 4: బీసీల సమగ్రాభివృద్ధి కోసమే జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నామని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. మామిడికుదురులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళగిరిలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో మంగళవారం జరిగే సదస్సుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, పలువురు మాజీ మంత్రులు హాజరవుతారన్నారు. బీసీ డిక్లరేషన్ విడుదల చేస్తారని, ఇది రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారి సమగ్ర వికాసానికి, కొత్త అధ్యాయానికి తెర తీస్తుందన్నారు.

పి.గన్నవరం నియోజకవర్గంలో రూ.32 కోట్లతో రహదారుల అభివృద్ధి

పి.గన్నవరం, మార్చి 4: పి.గన్నవరం నియోజవర్గంలోని ఐదు ప్రాంతాల్లో రూ.32 కోట్లతో రహదారుల అభివృద్ధి జరుగుతోందని వైసీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. పి.గన్నవరం ప్రధాన రహదారి చెంతన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని సోమవారం వారు ఆవిష్కరించారు. ఆర్‌అండ్‌బీ డీఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పి.గన్నవరం-అంబాజీపేట రోడ్డుకు సంబంధించి పోతవరంలో 320మీటర్ల మేర రక్షణ గోడ, పోలీస్‌స్టేషన్ వరకు సీసీ రోడ్డు పనులు జరుగుతాయన్నారు. పి.గన్నవరం-నరేంద్రపురం, బోడపాటివారిపాలెం, మడిపల్లి-ముక్కామల, అంబాజీపేట-పుల్లేటికుర్రు ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోలేటి బంగారునాయుడు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మిరాకిల్ మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం'

రాజోలు, మార్చి 4: మిరాకిల్ శాంతి సదన్ మినిస్ట్రీస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న అధినేత వై.శ్రావణ్‌కుమార్-సంధ్య సేవలు అభినందనీయమని గుడ్ సీడ్‌ఫౌండేషన్ చైర్మన్ కుంచే రమణారావు అన్నారు. కడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనానికి మిరాకిల్ మినిస్ట్రీస్ అధినేత శ్రావణ్‌కుమార్ సమకూర్చిన వంద కుర్చీలను సర్పంచ్ చొప్పల గుణనాథ్, ఆనంద్‌లకు సోమవారం ఆయన అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మామిడికుదురు, మార్చి 4: మండలంలోని పెదపట్నంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అదే గ్రామానికి చెందిన రాయుడు దుర్గాప్రసాద్ (19) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని నగరం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. పల్సర్ బైక్‌పై వెళ్తున్న దుర్గాప్రసాద్ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొనగా పక్కనే ఉన్న చెట్టుకు తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని చికిత్స నిమిత్తం తొలుత రాజోలు ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

ఆటో ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు

ముమ్మిడివరం, మార్చి 4: ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. భీమవరానికి చెందిన సాలి నాని, రాపాక సుబ్బారావు పల్సర్ మోటారు సైకిల్‌పై అమలాపురం వైపు వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సుబ్బారావును మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నాని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ముమ్మిడివరం ఎస్‌ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుదుచ్చేరి ఎంపీ సీటు బీజేపీకి!

యానాం, మార్చి 4: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పుదుచ్చేరి లోక్‌సభ స్థానం నుంచి ఎన్డీయే కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని సీఎం రంగసామి అధికారికంగా ప్రకటించారు. పుదుచ్చేరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే అభ్యర్థి ఎవరనేది బీజేపీ అధిష్ఠానం ప్రకటిస్తుందని, ఎన్నికల ప్రచారానికి ప్రధాని నరేంద్ర మోడీ పుదుచ్చేరి వస్తారన్నారు. కాగా బీజేపీ నుంచి ఎవరు పోటీ చేస్తారన్న అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడు గవర్నర్ తమిళిసై, పుదుచ్చేరి హోం శాఖ మంత్రి నమశ్శివాయం పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి.

ఆలమూరులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ఆలమూరు, మార్చి 4: టీడీపీ కొత్తపేట నియోజకవర్గ యువ నేత బండారు సంజీవ్ ఆధ్వర్యంలో సోమవారం ఆలమూరులో 'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరావు

రాజకీయ పార్టీలు భయపడేలా బీసీలు ఎదగాలి

పార్టీలకతీతంగా బీసీల సంక్షేమానికి కృషి చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

పి.గన్నవరం, మార్చి 4: రాజకీయ పార్టీలకు ఊడిగం చేసేలా కాకుండా పార్టీలు భయపడేలా బీసీలు ఎదగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. 2029 నాటికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకోవాలని, ఆ దిశగా సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కె.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన విత్తనాల ప్రభాకర్‌కు నియామక ఉత్త ర్వులను శంకరరావు అందజేశారు. బీసీ సంక్షేమ సంఘంలో వివిధ హోదాల్లో ఉన్న వారికి దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మరి క్రాంతికుమార్, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సంసాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జానా శ్రీనివాస్, అర్గనైజర్ బొంతు శ్రీనివాస్, స్థానిక నాయకులు గుత్తుల ధర్మ, పెచ్చెట్టి రాంబాబు, కాండ్రేగుల నరసింహం, చీకట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచార ప్రారంభానికి తరలిరావాలి: బుచ్చిబాబు



ముమ్మిడివరం, మార్చి 4: ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి మంగళవారం ఉదయం 8.20 గంటలకు తాను ప్రచారం ప్రారంభిస్తానని ముమ్మిడివరం నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరంలో దొమ్మేటి రమణకుమార్ అధ్యక్షతన సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలన్నారు. చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, పొద్దోకు నారాయణరావు, దాట్ల పృథ్వీరాజ్, తాడి జానకీరామ్, తాడి నరసింహారావు, సబ్బతి ఫణీశ్వరరావు, దివి విజయ్, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, కాశి రామచంద్రరావు, మాదాల పరంకుశం, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, కుడుపూడి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పోటీలు

అమలాపురం టౌన్, మార్చి 4: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సోమవారం పలు పోటీలు నిర్వహించారు. శ్రీకోనసీమ మహిళా మండలి ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి ఆధ్వర్యంలో 60 ఏళ్లలోపు, 60ఏళ్లు పైబడిన విభాగాల్లో మహిళలకు నడక, ఒక నిమిషం పోటీలు నిర్వహించారు. నూలు వాణి, పచ్చిగోళ్ల రత్నమాల, యక్కల సాయిలక్ష్మి, సింగంశెట్టి సుధ, బొంతు వరలక్ష్మి, మహ్మద్ రజియా విజేతలుగా నిలిచారు. వారికి జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారి, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, ఎలెక్ట్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. శ్రీగిరి పద్మావతి, యర్రమిల్లి అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

రాయవరం, మార్చి 4: మండలంలోని సోమేశ్వరం పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులను సోమవారం ప్రారంభించారు. రాయవరం-సోమేశ్వరం ప్రధాన రహదారిలో సుమారు రూ.4లక్షలతో మరమ్మతులు చేపట్టామని, రాయవరం-లొల్ల రోడ్డును రూ.50 లక్షలతో బాగు చేస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ టీవీఎస్ సూర్యనారాయణ తెలిపారు.

రజక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

ముమ్మిడివరం, మార్చి 4: రజకుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని ముమ్మిడివరం తాలూకా రజక సంఘం విజ్ఞప్తి చేసింది. ముమ్మిడివరంలోని రజక కమ్యూనిటీ భవనంలో సోమవారం అమలాపురం తాలూకా రజక సంఘ అధ్యక్షుడు పేట ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముమ్మిడివరం మండల రజక సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ముమ్మిడివరపు రాంబాబు, ఉపాధ్యక్షుడిగా నడవపల్లి వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా కేశనకుర్తి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శిగా కమిడి మణికంఠ, కోశాధికారిగా సామంతకుర్తి క్రాంతికుమార్, మరికొంతమంది సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కమిడి నాగేశ్వరరావు, ముమ్మిడివరపు వెంకన్నబాబు, సముదాలపాలెపు సత్యనారాయణ, గొల్లపల్లి ధర్మారావు, కోటిపల్లి మోహనరావు, సత్యవాడ రామకృష్ణ, పోలవరపు వెంకటరమణ, సామంతకుర్తి సురేష్‌కుమార్, సామంతకుర్తి సూర్యనారాయణ, సముదాలపాలెపు పేరయ్య, అయినాపురపువెంకట్రావు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి'

అంబాజీపేట, మార్చి 4: విద్యార్థులు ఏకగ్రతతో చదవి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో మోకా ప్రకాష్ కోరారు. తొండవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రాజశేఖర్ పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సంస్థ సీఈవో మయూర్ పట్నాల, కో-ఆర్డినేటర్ ఎం.రవీంద్రనాథ్ పాల్గొన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అర్చకుడు మర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతి దేవి పూజ చేశారు. అనంతరం పూజలో ఉంచిన పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

యానాం, మార్చి 4: యానాం ప్రజా పనుల శాఖ, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నియోజవర్గంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి మునిస్వామి, ఇన్‌చార్జి కమిషనరు ఖండవల్లి రామకృష్ణ, ప్రజా పనుల శాఖ ఈఈ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమా మందేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

కొత్తపేట, మార్చి 4: మందపల్లిలోని ఉమామందేశ్వర, ఉమాసుబ్రహ్మణ్యేశ్వర, ఉమా నాగేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవాలను మంగళవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం రాత్రి 9.30 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలకరించారు. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

7న పి.గన్నవరంలో మెగా జాబ్‌మేళా

అమలాపురం టౌన్, మార్చి 4: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పి.గన్నవరంలో ఈ నెల 7న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు డీఎస్డీవో పి.లోకమాన్ తెలిపారు. సంబంధిత పోస్టర్‌ను కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఆవిష్కరించారు. 14 ప్రముఖ కంపెనీల్లో సుమారు 850 ఖాళీలను భర్తీ చేసేందుకు పి.గన్నవరంలోని లక్ష్మి ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. సందేహాల నివృత్తికి 8247645389 నెంబరును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.నుపూర్‌జయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, నాగబాబు, రాజకుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 4: ఆత్రేయపురంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహించనున్నారు. ఐదు రోజులు వాహన సేవలు, హోమాలు జరుపుతారు. గోవిందమాలధారులు దీక్ష స్వీకరిస్తారు. ఉత్సవాల ఆహ్వాన పత్రికలను నిర్వాహకులు సోమవారం ఆవిష్కరించారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కొత్తపేట, మార్చి 4: మండలంలోని పలివెల గ్రామానికి చెందిన వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. చప్పిడిగూడెం ఎస్టీ ఏరియా నుంచి పెద్ద సంఖ్యలో చేరిన వారికి కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ వాడపాలెం గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు గనిశెట్టి శేఖర్ టీడీపీలో చేరగా ఆయనకు పార్టీ కుండవా కప్పి ఆహ్వానించారు. వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని బండారు చెప్పారు. కార్యక్రమంలో త్సామా బాబు, బండారు ధనరాజు, వీరబాబు, కుంపట్ల కుమారస్వామి, పప్పుల బుజ్జి, పలివెల గ్రామ నాయులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం ప్రారంభం

అంతర్వేది, మార్చి 4: సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక రేవులో సర్ ఆర్థర్ కాటన్ విగ్రహాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సోమవారం ప్రారంభించారు. ధవళేశ్వరం బ్యారేజీ నిర్మాణం, గన్నవరం ప్రధాన పంటకాల్వ సఖినేటిపల్లికి రావడానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి కాటన్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు రేపూరి రాజేశ్వరిఏసు, గొల్ల మందల చిట్టిబాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి

మలికిపురం, మార్చి 4: యువత సత్ప్రవర్తనతో మెలుగుతూ ఉన్నత శిఖరాలకు వెళ్లాలని రాజోలు సీఐ గోవిందరాజు కోరారు. సోమవారం జరిగిన మలికిపురం ఎంవీఎన్ జేఎస్-ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. లక్ష్యం వైపు దృష్టి పెట్టడం తద్వారా తల్లిదండ్రులకు, కళాశాలకు, సమాజానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటల్లో పాల్గొనాలన్నారు. ప్రిన్సిపాల్ తోరం సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి, జాన శంకరరావు, ఆర్.పద్మరాజు, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రాజోలు, మార్చి 4: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.50లక్షలతో వేగివారిపాలెంలో 60 మీటర్ల రోడ్డు నిర్మాణానికి రాజోలు ఎంపీపీ కేతా శ్రీను సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బొక్కా ప్రకాశం, కంచి అప్పారావు, యాండ్ర దొరబాబు, మామిడిశెట్టి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సప్తాహం

అల్లవరం, మార్చి 4: గోడి-గోడిలంక సీతారామాంజనేయ ఆలయం వద్ద సప్తాహ మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఈ నెల 7వ తేదీ వరకు వివిధ భజన మండళ్లు నిరంతరం భజనలు చేస్తాయని ఆలయ కమిటీ తెలిపింది.